సాక్షి చిత్తూరు

శుక్రవారం । 24 । ఫిబ్రవరి । 2023





చిత్తూరు బులియన్

బంగారం :

| | |
|---|---|
| 24 క్యారెట్లు 10 గ్రాములు | రూ.53,180 |
| 22 క్యారెట్లు ఒక గ్రాము | రూ.4,810 |

వెండి:

| | |
|---|---|
| హోల్‌సేల్ ధర (కిలో) | రూ.69,100 |
| రిటైల్ వెండి గ్రాము | రూ.71.60 |

| | గరిష్టం | కనిష్టం |
|---|---|---|
| చిత్తూరు | 35 | 17 |
| తిరుపతి | 35 | 17 |
| తిరుమల | 31 | 13 |
| గూడూరు | 36 | 19 |
| నగరి | 36 | 18 |



## జాతీయ సదస్సు

తిరుపతి ఎడ్యుకేషన్ : వెటర్నరీ కళాశాల ఆడిటోరియం వేదికగా 'కోస్తాలో వ్యవసాయ పర్యావరణ స్థితిస్థాపకత పెంపు' అనే అంశంపై నిర్వహిస్తున్న జాతీయ సదస్సులో భాగంగా రెండో రోజైన గురువారం పలు అంశాలపై చర్చా గోష్టి నిర్వహించారు.

## న్యూస్‌రీల్

### కాణిపాకం హుండీ ఆదాయం రూ.1.36 కోట్లు



కానుకల లెక్కింపును పరిశీలిస్తున్న ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానానికి హుండీ కానుకల ద్వారా రూ.1.36 కోట్ల ఆదాయం వచ్చినట్లు చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. ఆలయంలో గత 20 రోజుల హుండీ కానుకలను ఆస్థాన మండపంలో గురువారం లెక్కించారు. 45 గ్రాముల బంగారం, వెండి కిలో 700 గ్రాములు, ఫారిన్ కరెన్సీ యూఎస్‌ఏ 4,037 డాలర్లు, ఆస్ట్రేలియా 235 డాలర్లు, కెనడా 35 డాలర్లు, ఇంగ్లాండ్ 15 పౌండ్స్, సింగపూర్ 12 డాలర్లు, మలేషియా ఒక రింగిట్స్‌తో కలిపి రూ.1.36 కోట్లు ఆదాయం వచ్చినట్లు వివరించారు. ఆలయ ఏఈఓలు ఎస్వీ కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, విద్యాసాగర్ రెడ్డి, హరిమాధవ రెడ్డి, హేమమాలిని, పర్యవేక్షకులు శ్రీధర్‌బాబు, కోదండపాణి, శ్రీనివాస్ రవి, అర్ధగిరి ఆలయ ఈఓ సుబ్బారెడ్డి, ఆలయ సిబ్బంది, కాణిపాక యూనియన్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

### 3 నుంచి లక్ష మోదక, లక్ష్మీగణపతి హవనం

కాణిపాకం(యాదమరి): లోక కల్యాణం కోసం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో మార్చి 3వ తేదీ నుంచి 3రోజుల పాటు విశాఖ శారదా పీఠాధిపతి స్వహస్తాలతో లక్ష మోదక, లక్ష్మీగణపతి హవనం పూజలు నిర్వహించనున్నట్లు దేవస్థానం చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. గురువారం మధ్యాహ్నం ఆలయ సమావేశ మందిరంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా మొదటిసారిగా లక్ష మోదక, లక్ష్మీగణపతి హవనం పూజ నిర్వహించనున్నట్లు తెలిపారు. విశాఖ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి, ఉత్తర అధికారి శ్రీశ్రీశ్రీ స్వాత్మనందేంద్ర సరస్వతిస్వామి ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పూజలతో రాష్ట్రం, దేశ సుభిక్షంగా ఉంటుందన్నారు. దేవదాయశాఖ మంత్రి సత్యనారాయణ, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే ఎంఎస్ బాబు సహకారాలతో ఈ పూజలు నిర్వహించనున్నట్లు వివరించారు.

**1న కాణిపాకానికి రాజమాత రాక**

కేరళ రాష్ట్రం తిరువనంతపురంలో వెలసిన శ్రీపద్మనాభస్వామి ఆలయ రాజమాత మార్చి 1వ తేదీన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దర్శనార్థం విచ్చేయనున్నట్లు చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. కాణిపాక ఆలయానికి ఏనుగును బహుకరించాలని రాజమాతను కోరనున్నట్లు పేర్కొన్నారు.

### డీటీసీ కార్యాలయంలో ఆడిట్ బృందం

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని డీటీసీ కార్యాలయంలో గురువారం కేంద్ర ఆడిట్ బృందం తనిఖీలు చేసింది. ఉమ్మడి జిల్లా ప్రకారం 2019–2022 మధ్య కాలంలో కార్యాలయ నిర్వహణ, జమ, ఖర్చులు, లోటుపాట్లు, తదితర అంశాలపై ఆడిట్ ను మొదలుపెట్టింది. వారం రోజుల పాటు ఆడిట్ జరగనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

### వేసవిలో మెరుగైన విద్యుత్



మాట్లాడుతున్న ట్రాన్స్‌కో సీఎండీ శ్రీధర్

చిత్తూరు కార్పొరేషన్: వేసవిలో వినియోగదారులకు మెరుగైన విద్యుత్తు సరఫరా ఇవ్వాలని అధికారులను ట్రాన్స్‌కో సీఎండీ శ్రీధర్ ఆదేశించారు. గురువారం చిత్తూరులోని 220 కేవీ సబ్ స్టేషన్‌ను ఆయన పరిశీలించారు. చిత్తూరు అర్బన్ డివిజన్ పరంగా ఎంత లోడ్ అవసరం, ఎంత సరఫరా ఇస్తున్నారో తెలుసుకున్నారు. వేసవిలో లోడ్‌ను దృష్టిలో పెట్టుకొని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిత్యం సరఫరాను సమీక్షిస్తూ లోటుపాట్లు లేకుండ విద్యుత్ అందించాలన్నారు. పాత ఇనుప వస్తువులను తుక్కు కింద ఆన్‌లైన్‌లో వేలం వేయాలని సూచించారు. ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురయితే వెంటనే తెప్పించి మార్పు చేయాలన్నారు. అనంతరం వేపంజేరిలోని 400 కేవీ సబ్‌స్టేషన్‌ను పరిశీలించారు. లోడ్ మానిటరింగ్ వివరాలను తెలుసుకున్నారు. రైతులతో మాట్లాడారు. వ్యవసాయానికి మీటర్లు బిగిస్తే ఎటువంటి సమస్య ఉండదని తెలిపారు. ఎంత విద్యుత్ అందిస్తున్నామో వివరాలు తెలుసుకునేందుకే మీటర్లు పెడుతున్నట్లు పేర్కొన్నారు. ఈఈలు హరి, నాగేశ్వరరావు, సతీష్, డీఈ శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

# విషపు రాతలపై నిప్పులు

ప్రభుత్వంపై అసత్య వార్తలు ప్రచురిస్తూ ప్రజలను తప్పుదారిపట్టిస్తున్న ఈనాడు పత్రిక విషపు రాతలపై చిత్తూరు జిల్లాలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు భగ్గుమన్నాయి. టీడీపీ నేత పట్టాభిని పోలీసులు చిత్రహింసలు పెట్టారని రెండేళ్ల నాటి పాత ఫొటోలతో ప్రచురించిన ఈనాడు వార్త కథనాన్ని తప్పుపట్టారు. ఆ పత్రిక ప్రతులను దహనం చేశారు.

- జిల్లాలో పెల్లుబికిన ఆగ్రహం
- అసత్యాలపై మండిపాటు
- పలు చోట్ల ఈనాడు పత్రిక దహనం



చిత్తూరులో ఈనాడు పేపర్లను దహనం చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసులు, మేయర్ అముద, నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: ఈనాడు అసత్య వార్తలపై చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తీవ్రంగా మండిపడ్డారు. ఆయన ఆధ్వర్యంలో గురువారం ఈనాడు పేపర్లను దహనం చేసి, ఆ పత్రికను నిషేధించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వంపై కక్షగట్టి టీడీపీకి బానిసగా మారి అసత్యాలను ఈనాడు ప్రచురితం చేస్తోందని ధ్వజమెత్తారు. సీఎంపై అసభ్యంగా ఆరోపణలు చేసే టీడీపీ నేత పట్టాభిపై రామోజీరావుకు అంత ప్రేమ ఎందుకని ప్రశ్నించారు. రెండేళ్ల కిందట జరిగిన ప్రమాదంలో పట్టాభి గాయపడితే అది పోలీసులు ప్రయోగించిన థర్డ్ డిగ్రీ వల జరిగిందని ఫొటోలు ప్రచురించడం నీచాతినీచమని దుయ్యబట్టారు. సోషల్ మీడియాలో ఆధారాలతో సహా వైరల్ అయితే ఈనాడు రెండో పేజీలో ఓ మూలన తప్పు జరిగిందని సవరణ ఇచ్చిందన్నారు. గన్నవరం టీడీపీ కార్యాలయం వద్ద ఉద్రిక్త పరిస్థితి ఏర్పడితే పట్టాభిని పోలీసులు అదుపులో తీసుకున్నారని తెలిపారు. మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచినప్పుడు పోలీసులు చిత్రహింసలు చేశారని పట్టాభి తప్పుడు వాంగ్మూలం ఇచ్చారన్నారు. తీరా వైద్య పరీక్షలు చేసినప్పుడు చేతికి తప్ప ఇతర గాయాలు కాలేదని వైద్యులు ధ్రువీకరించిన విషయం గుర్తు చేశారు.

**ప్రజలు అన్నీ గమనిస్తున్నారు.**

చిత్తూరు మేయర్ అముద, చుడా చైర్మన్ పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, టీడీపీని జాకీ పెట్టి లేపినా ప్రయోజనం లేదన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు లీనారెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు తప్ప రాష్ట్రాన్ని ఇంకెవరు పాలించినా రామోజీరావుకు నచ్చదని తెలిపారు. వీధిరౌడీలాగా ప్రవర్తించే పట్టాభిని కొట్టారంటూ ఈనాడు తప్పుడు కథనాలు రాయడంపై జనం ఏవగించుకుంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు త్యాగ, కిరణ్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

**గల్లీ నాయకుడికి వత్తాసా?**

పెనుమూరు(కార్వేటినగరం): సమాజంలో బాధ్యతగా ఉండాల్సిన పత్రిక ఒక గల్లీనాయకుడైన పట్టాభిని హింసించారని తప్పుడు వార్త ప్రచురించడం సిగ్గుచేటని ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి మండిపడ్డారు. మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతి భద్రతలు లేవని అసత్య కథనాలు రాస్తూ ప్రజలను తప్పుదారి పట్టించేందుకు చూస్తున్న రామోజీరావుకు, ఆయన నమ్ముకున్న చంద్రబాబుకు ప్రజలు త్వరలో తగిన గుణపాఠం నేర్పుతారని అన్నారు.

**తప్పుడు వార్తలు ఇకనైనా మానుకోవాలి**



సోమల: ఈనాడు దినపత్రికను దహనం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

సోమల: ఈనాడు దినపత్రిక అవాస్తవాలను ప్రచురించడం ఇకనైనా మానుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకులు హితవు పలికారు. విద్వేషాలను రెచ్చగొట్టేలా, ప్రజలను పక్కదారి పట్టించేలా టీడీపీ నేత పట్టాభి కథనాన్ని ప్రచురించడంపై వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గంగాధరం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో గురువారం వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఈనాడు దినపత్రికను దహనం చేశాయి. గంగాధరం, ఏఎంసీ మాజీ చైర్మన్ నాగేశ్వరరావు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై బురదజల్లడమే ధ్యేయంగా ప్రతి రోజూ అవాస్తవ కథనాలను ప్రచురించడం హేయమన్నారు. టీడీపీని అధికారంలోకి తీసుకురావడమే ధ్యేయంగా ఆ పత్రిక చూపిస్తున్న చొరవను ప్రజలు ఛీదరించుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ ఈశ్వరయ్య, వైస్ ఎంపీపీ ప్రభాకర, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రమణయ్య, ఇరికిపెంట సర్పంచ్ రెడ్డెప్ప, నేతలు వరదం రమణ, తాతమల్లయ్య, సాంబయ్య, చక్రపాణి, సురేంద్ర, సరస్వతమ్మ, బగ్గిడి నాగరాజ, డీఎంకే కేశవ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# శ్యామ్ ప్రసాద్‌రెడ్డిని గెలిపించుకుందాం



ఓటర్ల జాబితాను అందుకుంటున్న మంత్రి ఆర్కే రోజా

నగరి : గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యామ్‌ప్రసాద్ రెడ్డిని గెలిపించుకుందామని రాష్ట్ర పర్యాటక, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. గురువారం శ్యామ్‌ప్రసాద్ రెడ్డి తరపు ప్రతినిధులు రమణారెడ్డి, కోదండం స్థానిక క్యాంప్ కార్యాలయంలో మంత్రిని కలిశారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధిత ఓటర్ల జాబితాను మంత్రికి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మార్చి 13న జరిగే పట్టభద్రుల ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బలపరచిన శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించే బాధ్యత మనందరిపై ఉందన్నారు. సామాన్య కారకర్త నుంచి పార్టీ కోసం కష్టపడి విజయాన్ని చేకూర్చాలని కోరారు. పార్టీ పరంగా అర్హత ఉన్నవారికి ఓటు హక్కు కల్పించినట్లు తెలిపారు. ఎన్నికల రోజుల పోలింగ్ చేయించే బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. నగరి నియోజకవర్గంలోని 5 మండలాల్లో ఏర్పాటు చేసిన 9 పోలింగ్ బూత్‌లకు సంబంధిత ఏజెంట్లుగా నియమించే వారికి దిశా నిర్దేశం చేసినట్లు తెలిపారు. సమష్టి కృషితో విజయం తథ్యమని పేర్కొన్నారు. పుత్తూరు మున్సిపల్ చైర్మన్ హరి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రారెడ్డి, మున్సిపల్ సచివాలయాల కన్వీనర్ దయానిధి, నాయకులు మునికృష్ణారెడ్డి పాల్గొన్నారు.

# అట్టహాసంగా సిపాయి నామినేషన్



ఆర్‌ఓ వెంకటేశ్వర్‌కు నామినేషన్ పత్రాలను అందజేస్తున్న సిపాయి సుబ్రహ్మణ్యం

- పాల్గొన్న డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, ప్రజాప్రతినిధులు
- వైఎస్సార్ సీపీ భారీ ర్యాలీ

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు వైఎస్సార్ సీపీ బలపరిచిన సిపాయి సుబ్రహ్మణ్యం గురువారం నామినేషన్‌ను దాఖలు చేశారు. తొలుత నగరంలోని గాంధీ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ జరిగింది. కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో స్థానిక సంస్థల రిటర్నింగ్ ఆఫీసర్, జేసీ వెంకటేశ్వర్‌కు నామినేషన్ పత్రాలను అందజేశారు. డిప్యూటీ సీఎం నారాయణస్వామి, జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, తిరుపతి ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ భరత్, నగర మేయర్ అముద, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

**వైఎస్సార్‌సీపీలోనే సామాజిక న్యాయం**

డిప్యూటీ సీఎం మాట్లాడుతూ నారాయణస్వామి మాట్లాడుతూ సీఎం జగన్ బీసీలకు పెద్దపీట వేశారని పేర్కొన్నారు. అన్ని కులాల నాయకులను ప్రోత్సహించేందుకు రాజకీయంగా పదవులు ఇచ్చారని తెలిపారు. సిపాయి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ బీసీలకు స్వర్ణ యుగం జగనన్న పాలనలోనే దక్కిందన్నారు. బీసీలకు జగనన్న పాలనలోనే న్యాయం జరిగిందని తెలిపారు.

# సర్దుకుపోదాం.. రండి

- '1998లో చిత్తూరులో ఇద్దరు అన్నదమ్ముల మధ్య భూ సమస్య వచ్చింది. ఇద్దరూ కోర్టుకెక్కారు. అప్పటి నుంచి కేసు నడుస్తోంది. ఇద్దరూ న్యాయం కోసం ఆరాటపడుతున్నారు. ఇటీవల ఒకరు పట్టు వదిలి కేసు రాజీ చేసుకునేందుకు ముందుకొచ్చారు. చిత్తూరులోని న్యాయసేవాధికార సంస్థను సంప్రదిస్తే రాజీమార్గం ద్వారా లోక్ అధాలత్‌లో సెటిల్ చేశారు. 25 ఏళ్ల పోరాటానికి తెరపడడంతో పాటు అన్నదమ్ములు ఇద్దరూ కేసును గెలిచినట్లయ్యింది.'
- 'చిత్తూరు నగరంలోని ఓ విద్యాసంస్థ బీఎస్ఎన్ఎల్‌కు దీర్ఘకాలికంగా బిల్లులు చెల్లించలేదు. అసలు, వడ్డీ మొత్తం కలిపి రూ.7 లక్షల వరకు చెల్లించాలి. కేసు రాజీ చేసుకునేందుకు విద్యాసంస్థ నిర్వాహకులు న్యాయాధికార సేవా సంస్థను కలిశారు. బీఎస్ఎన్ఎల్ సంస్థతో మాట్లాడిన న్యాయశాఖ అధికారులు.. మొత్తం బకాయిలు రూ.2 లక్షలకు సెటిల్ చేసి ఇరు పక్షాలు అంగీకరించేలా కేసు రాజీ కుదిర్చారు.' రాజీ చేసుకోదగిన కేసులకు లోక్ అదాలత్ ఓ చక్కటి వేదికగా మారుతోంది.
- ఇటీవల అదాలత్‌లలో కేసులు రాజీ చేసుకునే కక్షిదారుల సంఖ్య భారీగా పెరుగుతోంది. న్యాయ సేవలపై పెరుగుతున్న అవగాహన, న్యాయశాఖ అవగాహన కార్యక్రమాలు ప్రజల ఆలోచనాతీరులో మార్పును తీసుకొస్తున్నాయి. గత నవంబర్, ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన జాతీయ అదాలత్‌లలో అత్యధిక కేసులను పరిష్కరించి చిత్తూరు జిల్లా న్యాయశాఖ రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలవడమే ఇందుకు నిదర్శనం.

- కక్షిదారుల రాజీకి వేదికగా మారుతున్న అదాలత్‌లు
- సకాలంలో న్యాయం అందించేందుకు న్యాయశాఖ చర్యలు
- ప్రజల్లో పెరుగుతున్న చైతన్యం.. రాజీ మార్గమే రాచమార్గం
- పెండింగ్ కేసుల పరిష్కారంలో ఉమ్మడి జిల్లా రికార్డు



చిత్తూరు లోక్ అదాలత్‌లో కేసు పరిష్కరిస్తున్న జిల్లా జడ్జి భీమారావు (ఫైల్)

చిత్తూరు అర్బన్ : లోక్ అదాలత్‌లలో పెద్ద సంఖ్యలో కేసులు పరిష్కారమవుతున్నాయి. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవచ్చని దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలతో ఏటా నాలుగు సార్లు జిల్లాలో మెగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నారు. అలాగే ప్రతి నెలా అదాలత్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఇది సత్ఫలితాలను ఇస్తోంది. చిత్తూరు ఉమ్మడి జిల్లాలో జరిగిన గత రెండు జాతీయ లోక్ అదాలత్‌లలో పరిష్కరించిన కేసులు రాష్ట్ర స్థాయిలో రికార్డును సృష్టించాయి. 2021 జనవరి 1వ తేదీ నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు 356 లోక్ అదాలత్‌లు నిర్వహిస్తే.. 9097 కేసులు పరిష్కరించిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, రూ.74.44 కోట్లను సెటిల్ చేసింది. గతేడాది 989 అదాలత్‌లు నిర్వహిస్తే 59,370 కేసులు పరిష్కరించి రూ.111.21 కోట్లను సెటిల్ చేసింది. గతేడాది నవంబర్, ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన జాతీయ అదాలత్‌లలో అత్యధిక కేసులను పరిష్కరించి చిత్తూరు జిల్లా న్యాయశాఖ రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది.

**ఏ కేసులు రాజీ చేసుకోవచ్చు..**

కోర్టులో పెండింగ్‌లో ఉన్న ప్రతి కేసును అదాలత్‌లో పరిష్కరించుకోవడం సాధ్యం కాదు. చిన్నపాటి కొట్లాటలు, దూషణలు, రోడ్డు ప్రమాదాలు, పరిమిత సివిల్ కేసులు, ఎక్సైజ్ కేసులు, చిట్‌ఫండ్, మోటారు వాహన కేసులు లాంటివి అదాలత్‌లో రాజీ చేసుకోచ్చు. కిడ్నాప్, హత్యలు, అత్యాచారాలు, ఫోక్సో, అట్రాసిటీ లాంటి పెద్ద పెద్ద ఘటనలకు సంబంధించిన కేసులను రాజీ చేసుకోవడం కుదరదు. దీనిపై న్యాయ సేవాధికార సంస్థ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

**సత్వర న్యాయం కోసమే..**



కేసులను కూర్చుని మాట్లాడుకుని పరిష్కరించుకోవడం కంటే మరో మంచిపని ఉండదు. రాజీ చేసుకోవడం అనేది అన్నింటికంటే ఉత్తమం. ఇక్కడ ఒకరు ఓడిపోయినట్లు, మరొకరు గెలవడమనేది ఉండదు. న్యాయస్థానాలపై భారం తగ్గించడంలో కూడా అదాలత్ కీలకపాత్ర వహిస్తుంది. అన్నింటికంటే ముఖ్యంగా కక్షిదారులకు సత్వర న్యాయం జరగాలన్నదే అదాలత్ లక్ష్యం. కేసును రాజీ చేసుకోవాలనుకునే కక్షిదారులు చిత్తూరు పాత కోర్టు భవనంలో ఉన్న న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్) కార్యాలయానికి వచ్చి తనను లేదా సిబ్బందిని కలిస్తే చాలు. సాధ్యాసాధ్యాలు పరిశీలించి రాజీ ద్వారా కేసుల్ని పరిష్కరిస్తాం.

– ఐ.కరుణకుమార్, కార్యదర్శి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ, చిత్తూరు

# ముగిసిన ఎమ్మెల్సీ నామినేషన్ల పర్వం

- గ్రాడ్యుయేట్‌కు 39,
- ఉపాధ్యాయ స్థానానికి 12 దాఖలు

సాక్షి, చిత్తూరు: ఉమ్మడి ప్రకాశం–నెల్లూరు–చిత్తూరు, స్థానిక సంస్థల ఉమ్మడి చిత్తూరు ఎమ్మెల్సీ స్థానాలకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ గురువారంతో ముగిసింది. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు నామినేషన్లను స్వీకరించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరి నారాయణన్ నామినేషన్లను స్వీకరించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎమ్మెల్సీ స్థానానికి వైఎస్సార్ సీపీ అభ్యర్థి సిపాయి సుబ్రహ్మణ్యం నామినేషన్‌ను ఆర్వో వెంకటేశ్వర్‌కు అందజేశారు. విజయపురానికి చెందిన ధనంజయులు ఇండిపెండెంట్‌గా నామినేషన్ దాఖలు చేశారు.

**చివరి రోజు ఇలా..**

చివరి రోజు గురువారం గ్రాడ్యుయేట్ స్థానానికి17, ఉపాధ్యాయ స్థానానికి 5 నామినేషన్లు దాఖలయ్యాయి. గ్రాడ్యుయేట్ స్థానానికి వైఎస్సార్ సీపీ, టీడీపీ, బీజేపీ, జనసేన, పీడీఎఫ్ అభ్యర్థులతో పాటు ఇండిపెండెంట్‌లు నామినేషన్లు దాఖలు చేశారు.

| గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ నామినేషన్ల వివరాలు | | |
|---|---|---|
| 16వ తేదీ | 01 | 01 |
| 17వ తేదీ | నిల్ | నిల్ |
| 20వ తేదీ | 01 | నిల్ |
| 21వ తేదీ | 05 | నిల్ |
| 22వ తేదీ | 15 | 06 |
| 23వ తేదీ | 17 | 05 |
| మొత్తం | 39 | 12 |

### అబ్జర్వర్ల రాక

చిత్తూరు కలెక్టరేట్ : ఎమ్మెల్సీ ఎన్నికల అబ్జర్వర్‌లు గురువారం జిల్లా కేంద్రానికి విచ్చేశారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అబ్జర్వర్ శ్రీధర్ కలెక్టరేట్‌లో నామినేషన్ల స్వీకరణ ప్రక్రి యను పర్యవేక్షించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అబ్జర్వర్ కాటమనేని భాస్కర్ ఎన్నికల నిర్వహణలో ఏవైనా సమస్యలు, ఫిర్యాదులు ఉంటే 9676697575 నంబర్‌కు తెలియజేయాలని పేర్కొన్నారు.

## ఫిట్ ఇండియా క్విజ్ మెయిన్స్‌కు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

**గుడుపల్లె:** రాష్ట్రస్థాయి ఫిట్ ఇండియా క్విజ్ పోటీల ప్రాథమిక రౌండ్‌లో గుడుపల్లె ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటి మెయిన్స్‌కు ఎంపిక అయినట్లు కళాశాల ప్రిన్సిపాల్ భువనేశ్వరి తెలిపారు. 7వ తరగతి విద్యార్థిని అనహిత, 9వ తరగతి విద్యార్థిని మైత్రి గత ఏడాది డిసెంబర్ 8, 9 తేదీల్లో జరిగిన పిలిమినరీ రౌండ్‌లో పాల్గొన్నారని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో 5వ, 20వ ర్యాంకు కైవసం చేసుకుని మెయిన్స్‌కు ఎంపిక అయినట్లు తెలిపారు. అలాగే విజయవాడలో ఈనెల 27, 28 తేదీల్లో జరగనున్న రాష్ట్ర స్థాయి విజ్ఞాన మేళా ప్రదర్శనకు తమ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. పర్యావరణ అనుకూల పదార్థాలతో అగర బత్తులు, ధూప కడ్డీల తయారీపై నమూనాలు ప్రదర్శించనున్నారని పేర్కొన్నారు.

## 26న 'ఉపాధ్యాయ' ప్లాటినం జూబ్లీ

**పలమనేరు:** తిరుపతిలోని గంధమనేని శివయ్య భవన్‌లో ఈనెల 26న జరిగే ఏపీ టీచర్స్ ఫెడరేషన్ అధికారిక మాసపత్రిక ఉపాధ్యాయ ప్లాటినం జూబ్లీ ఉత్సవాలను జయప్రదం చేయాలని పత్రిక సంపాదకుడు తులసీనాథం నాయుడు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ ఉపాధ్యాయులు అనుభవిస్తున్న ఎన్నో సౌకర్యాలకు కారణమైన ఉపాధ్యాయ పత్రిక ఉత్సవాల్లో ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

# సిజేరియన్లకు కత్తెర

- సాధారణ ప్రసవాలు పెంచేలా ప్రభుత్వం చర్యలు
- కడుపు కోతలు, ఫీజు వాతలకు చెక్
- తల్లీబిడ్డ ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి
- ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలే క్షేమం
- అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

**సాధారణ కాన్పులను ప్రోత్సహిస్తూ తల్లీబిడ్డ ఆరోగ్యమే ధ్యేయంతో రాష్ట్ర ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. కడుపు కోత చేసే ప్రైవేటు ఆస్పత్రులపై కఠిన చర్యలకు శ్రీకారం చుట్టింది. పురిటి నొప్పులతో ఆస్పత్రులకు వెళితే సాధారణ ప్రసవం చేసేందుకు కనీస ప్రయత్నాలే చేయకుండా సిజేరియన్ చేసేస్తున్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో కిష్టతర పరిస్థితుల్లో సిజేరియన్లు చేస్తుండగా, ధనార్జనే ధ్యేయంగా ప్రైవేటు ఆస్పత్రుల్లో 80–90 శాతం వరకు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కడుపు కోతలపై రాష్ట్ర ప్రభుత్వం కొరడా ఝుళిపించింది.**


జిల్లా ప్రభుత్వాస్పత్రిలో వైద్య పరీక్షలకు వచ్చిన గర్భిణులు

**చిత్తూరు రూరల్:** ఆస్పత్రుల్లో అనవసరంగా చేసే సిజేరియన్లకు అడ్డుకట్టకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది జిల్లాలో ఒక జిల్లా ఆస్పత్రి, మూడు ఏరియా ఆస్పత్రులు, 7 సీహెచ్‌సీలు, 50 పీహెచ్‌సీలు, 14 పట్టణ ఆరోగ్యకేంద్రాలు, 57 ప్రైవేటు ఆస్పత్రులు ఉన్నాయి. ఈ ఆస్పత్రుల్లో రోజుకు 60 నుంచి 80 వరకు ప్రసవాలు జరుగుతున్నాయి. ఇందులో 50 శాతానికి పైగా సిజేరియన్లు చేస్తున్నారు. అధికంగా ప్రైవేటు ఆస్పత్రుల్లోనే ఈ సంఖ్య కనిపిస్తోంది. కాసుల కోసమే ఇక్కడ కడుపు కోతలు పెడుతున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. గత పది నెలలుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో 742 ప్రసవాలు జరగగా, అందులో 550 సాధారణ కాన్పులు, 192 సిజేరియన్లు మాత్రమే జరిగాయి. ప్రైవేటు ఆస్పత్రుల విషయానికొస్తే మొత్తం 546 కాన్పులు జరగగా, 277 సాధారణ కాన్పులు, 269 సిజేరియన్లు చేశారు. ఈ లెక్క ప్రకారం ప్రైవేట్‌లో కడుపుకోతలు అధికంగా ఉందని అధికారులు గుర్తించారు. ఒక్కో కాన్పునకు ప్రైవేటులో రూ.50 వేల నుంచి రూ. 80 వేల వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

**దుష్ప్రభావాలు ఎన్నో..**

సిజేరియన్ ద్వారా కాన్పు చేస్తే పలు రకాల ఆరోగ్య సమస్యలు వేధిస్తాయి. కాన్పుతో రక్తస్రావం ఎక్కువగా జరుగుతుంది. సిజేరియన్ సమయంలో ఇచ్చే మత్తు మందుల కారణంగా సమస్యలు వచ్చేందుకు అవకాశం ఉంది. రక్తనాళ్లల్లో రక్తం గడ్డ కట్టే ప్రమాదం ఉంది. తర్వాత గర్భం దాల్చితే కష్టమవుతుంది. జాగ్రత్తలు తీసుకుంటే స్థూలకాయం, మధుమేహం, బీపీ, హార్మోన్లలో తేడాలు తదితర అనారోగ్య సమస్యలు వస్తున్నాయి.

**ప్రభుత్వాస్పత్రుల్లో సురక్షిత ప్రసవాలు**

ప్రభుత్వ ఆస్పత్రుల్లో సిజేరియన్ల సంఖ్యను తగ్గించేందుకు అధికారులు చర్యలు ప్రారంభించారు. పీహెచ్‌సీల్లో కూడా సురక్షిత ప్రసవాలు చేయాలని ప్రభుత్వం సూచించడంతో ఆ రకంగా అధికారులు కదులుతున్నారు. కష్టతర పరిస్థితుల్లో మాత్రమే జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేసేలా దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. రూపాయి కూడా ఖర్చు కాకుండా ప్రసవాలు జరిగేలా చూస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆస్పతుల్లో ప్రసవాల సంఖ్య పెరుగుతోంది. ప్రతి నెలా వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లకు సమావేశం నిర్వహించి సుఖ ప్రసవాలపై, గర్భిణులు తీసుకోవాల్సిన ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించి, గ్రామీణ ప్రాంతాల్లో చైతన్యం తెస్తున్నారు. ప్రసవాలు కూడా ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే చేయించుకోవాలని సూచిస్తున్నారు.

**కట్టడికి చర్యలు..**

ప్రైవేటు ఆస్పత్రుల్లో సిజేరియన్ల కట్టడికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ముఖ్యంగా వైఎస్సార్ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులపై నిఘా పెట్టింది. ఆడిట్ వ్యవస్థను అమలు చేస్తోంది. సుఖ ప్రసవాల సంఖ్యను పెంచేలా సూచనలు జారీ చేసింది. ఇకపై ఇష్టానుసారంగా సిజేరియన్లు చేస్తే కొరడా ఝుళిపించనుంది.

**సుఖ ప్రసవాలే లక్ష్యంగా..**



గర్భిణులకు అవగాహన అవసరం. ప్రధానంగా చికిత్సతో పాటు పౌష్టికాహారం తీసుకోవాలి. వివాహ వయస్సును పాటించాలి. సంతాన విషయంలో ఆలస్యం చేయ కూడదు. వైద్యుల సూచనలు తీసుకోవాలి. ప్రసవం కోసం ప్రభుత్వ వైద్యశాలలో అన్ని సదుపాయలు ఉన్నాయి. ఇక్కడ సుఖ ప్రసవాలే లక్ష్యంగా పనిచేస్తున్నాం. ప్రభుత్వం కూడా ఆరకంగా ఆదేశాలు ఇచ్చింది. –ఉషశ్రీ, గైనిక్ వైద్యాధికారి, చిత్తూరు ప్రభుత్వాస్పత్రి

**ప్రైవేటుపై చర్యలు తప్పవు**



సాధారణ కాన్పులు పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ముఖ్యంగా ప్రైవేటు ఆస్పత్రులపై నిఘా పెడుతున్నాం. అనవసరంగా సిజేరియన్ చేస్తున్నట్లు మా దృష్టికి వస్తే తక్షణ చర్యలు తీసుకుంటాం. ఇకపై ఆ ఆస్పత్రులపై నిరంతర పర్యవేక్షణ ఉంటుంది. తనిఖీలు చేస్తాం. ఫిర్యాదు వస్తే కేసులు పెడుతాం. –రవిరాజు, పీసీ అండ్ పీడీటీ, డీఐఓ

# పోలీసులతో బీజేపీ నేతల వాగ్వాదం

- నామినేషన్ కేంద్రం వద్ద హడావుడి చేసిన ఆ పార్టీ ఎమ్మెల్సీ, నేతలు
- సర్దిచెప్పినా వినిపించుకోని వైనం


తన కుర్చీలో ఎమ్మెల్సీ వాకాటి నారాయణ రెడ్డిని కూర్చోబెట్టిన సీఐ మద్దయ్య ఆచారి

**చిత్తూరు కలెక్టరేట్:** ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్ దాఖలు చేసేందుకు గురువారం చిత్తూరు విచ్చేసిన బీజేపీ నేతలు, ఆ పార్టీ నెల్లూరు ఎమ్మెల్సీ వాకాడు నారాయణరెడ్డి పోలీసులతో వాగ్వాదానికి దిగారు. నామినేషన్ కేంద్రం అని కూడా చూడకుండా పోలీసులతో రెచ్చగొట్టే వైఖరితో సంభాషించారు. బీజేపీ అభ్యర్థితో పాటు నామినేషన్ దాఖలుచేసేందుకు కలెక్టరేట్ వద్దకు ఆ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో వచ్చారు. ఎన్నికల నిబంధనల ప్రకారం నామినేషన్ వేసే అభ్యర్థితో పాటు ముగ్గురిని మాత్రమే లోనికి అనుమతిస్తామని పోలీసులు వారితో చెప్పారు. అవేమీ పట్టించుకోకుండా బీజేపీ నేతలు పోలీసులతో గొడవకు దిగారు. అదేవిధంగా నెల్లూరు ఎమ్మెల్సీ వాకాడు నారాయణరెడ్డి ఒక్కరే నామినేషన్ కేంద్రంలోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తే.. అభ్యర్థితో పాటు రండి అని రెండవ పట్టణ సీఐ మద్దయ్య ఆచారి చెప్పారు. అవేం పట్టించుకోకుండా ఆయన ఆగ్రహంతో మాట్లాడుతూ.. ''ఎంత మంది సీఎంలను చూడలేదు. అభ్యర్థితో పాటు వస్తే మీరేమిటీ అనుమతి ఇచ్చేది.. నేనే లోనికి వెళ్తాను. పేర్లు అన్నీ రాసుకున్నా. మీ అంతు చూస్తా. హోం సెక్రటరీకి మీ పేర్లు ఇస్తే అప్పుడుంటుంది మీకు'' అంటూ బెదిరించారు. ఆ ఎమ్మెల్సీ అంతా మాట్లాడుతున్నప్పటికీ పోలీసులు తమ వృత్తి ధర్మంతో ఆయనకు కుర్చీవేసి కూర్చోమని చెప్పారు.

# ఐఓసీలో విపత్తుల నివారణపై మాక్ డ్రిల్


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణారెడ్డి

**యాదమరి:** మండల కేంద్రంలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ టెర్మినల్‌లో గురువారం విపత్తులో ప్రమాదాలు జరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మాక్ డ్రిల్ నిర్వహించారు. భూకంపం వచ్చిన సమయంలో ట్యాంక్ పగిలి పెట్రోల్ లీక్ అయితే, పెట్రోల్ ఎండకు ఆవిరైన సమయంలో లీక్‌ను ఆపేందుకు వచ్చిన కార్మికులు అస్వస్థతకు గురతే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన కల్పించారు. ఇలాంటి ప్రమాదాలు జరిగితే చుట్టు పక్కల ఉన్న 35 గ్రామాల ప్రజలను తరలించే కార్యక్రమాలను వివరించారు. జాగ్రత్తలపై అటవీశాఖ, ఫైర్ అధికారులు డ్రిల్ నిర్వహించారు. అనంతరం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ అధికారులకు సిబ్బందికి సమావేశం నిర్వహించారు. చిత్తూరు జిల్లా ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణారెడ్డి, డీఎఫ్ఓ పెద్దిరెడ్డి, ఆర్డీఓ రేణుక మాట్లాడుతూ సౌత్ ఇండియాలోనే పెట్రోల్, డీజల్ నిల్వ ఉన్న చాల పెద్ద టెర్మినల్ ఇదని తెలిపారు. హైటెక్నాలజీతో నిర్మించారన్నారు. ప్రమాదాలు సంభవిస్తే వెంటనే ఫైర్ అధికారులకు, తదితర శాఖల అధికారులకు సమాచారం అందించాలన్నారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. టెర్మినల్ ఇన్‌చార్జ్ అమిత్య సర్ధార్, సేఫ్టీ ఇన్‌చార్జ్ అఖిలేష్, ఆంజినేయులు, యాదమరి ఎస్ఐ సుమన్, డీఎంఓ శ్రీనివాసులు, వైద్యులు సురేఖ, తదితరులు పాల్గొన్నారు.


పెట్రోల్ ట్యాంక్ ఫైర్ సిబ్బంది మాక్ డ్రిల్

**భయభ్రాంతులకు గురైన ప్రజలు**

గ్రామీణ ప్రజలకు సరైన సమాచారం లేకుండా ఐఓసీలో మాక్ డ్రిల్ నిర్వహించడంతో ఇక్కడ పెద్ద ప్రమాదం జరిగినట్లు గ్రామాల్లో భయాందోళన వ్యక్తం అయ్యింది. గతంలో మాక్ డ్రిల్ టెర్మినల్ లోపల నిర్వహించే వారు. ఎవ్వరికీ తెలిసేది కాదు. గురువారం ప్రజలకు సమాచారం లేకుండ ఉదయం 10 గంటల నుంచి రహదారిలో వాహనాలు ఆపేశారు. ప్రజలు ఎవ్వరు ఇటువైపు రాకూడదని ఆంక్షలు విధించారు. పోలీసులు బందోబస్తు నిర్వహిస్తు ప్రజలు వెళ్లి పోవాలని సూచించారు. అంబులెన్స్‌లు పరుగులు తీస్తుండడంతో టెర్మనల్‌లో పెద్ద ప్రమాదం జరిగిందని చుట్టు పక్కల ప్రజలు భయందోళనకు గురయ్యారు. మండల పరిధిలో గత 20 రోజులకు ముందు అమరరాజ గ్రోత్ కారిడర్‌లో భారీ అగ్ని ప్రమాదం జరిగిన సంఘటన మరవక ముందే మళ్లీ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌లో ఏదో జరిగిందని ఆందోళన చెందారు. తర్వాత మాక్ డ్రిల్ చేస్తున్నారని తెలుసుకుని ఊపిరి పీల్చుకున్నారు. అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

# శాస్త్రోక్తంగా కలశోద్వాసన


కలశోద్వాసన పూజలు


విశేష అలంకరణలో స్వామి, అమ్మవార్లు

**శ్రీకాళహస్తి:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ధ్వజావరోహణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ధ్వజస్తంభం వద్ద త్రిశూలంతో పాటు జ్ఞానప్రసూనాంబ సమేత సోమస్కందమూర్తి ఉత్సవమూర్తులకు సంకల్ప పూజ చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు బాబు, సాంబయ్య వరద గురుకుల్ ఆధ్వర్యంలో అంకురార్పణ సందర్భంగా ధ్వజస్తంభంపై అధిరోహించిన ధ్వజ పటాన్ని, ధవళ వస్త్రంతో పాటు భక్తులు సమర్పించిన చీరలను కిందకు దింపారు. తర్వాత ధ్వజస్తంభ పీఠానికి అభిషేకాలు చేసి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. యాగశాలలో ఏర్పాటు చేసిన యాగ కలశాలను ఉద్వాసన చేసి ఊరేగింపుగా తీసుకెళ్లి ధృవమూర్తులకు అభిషేకం చేశారు. రాత్రి 10.30 గంటలకు స్వామి, అమ్మవార్లు సింహ వాహనం, కామధేనువు వాహనాలపై ఊరేగారు. పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ సాగర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

**నేడు పల్లకీ సేవ**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ధ్వజావరోహణం ముగిసిన మరుసటి రోజు పల్లకీ సేవ నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా శుక్రవారం రాత్రి స్వామి అమ్మవార్ల పల్లకీ సేవ నిర్వహించనున్నారు. అమ్మవారు ముందు వెళుతుండగా స్వామి వారు వెనుక అలక తీర్చడానికి వస్తారు.


ధ్వజావరోహణం

## ఉగ్రాణంపల్లెలో సారా పట్టివేత

**చిత్తూరు అర్బన్ :** పెనుమూరు మండలం ఉగ్రాణంపల్లెలో గురువారం ఎస్ఈబీ అధికారులు దాడులు నిర్వహించి 7 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. సారా విక్రయిస్తున్న శివకోటి (42)ని అదుపులోకి తీసుకున్నారు. సీఐ జోగేంద్ర సమక్షంలో అరెస్ట్ చూపి రిమాండ్‌కు తరలించారు. సీఐ, ఎస్ఐలు పాల్గొన్నారు.

## నూతన కార్యవర్గం

**చిత్తూరు అర్బన్:** జిల్లా సచివాలయాల మహిళా పోలీసు కార్యదర్శుల సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం చిత్తూరులో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలిగా ఎం.శివగామి, ప్రధాన కార్యదర్శిగా కె.పావని, అదనపు ప్రధాన కార్యదర్శిగా బి.రేణుక, కోశాధికారిగా కె.భవ్య ఎన్నికయ్యారు. సభ్యులుగా క్రాంతి, తేజశ్రీ, శ్వేత, ప్రవల్లిక, శైలజ, తేజస్విని, భార్గవి, లక్ష్మి, ఫౌజియా తదితరులను ఎన్నుకున్నారు.


శివగామి


పావని